డా॥ జి. అరుణకుమారి అశోక్‌నగర్, హైదరాబాదు
16.08.2009

# దేవాలయాలు-సమాజ భవితవ్యం

దేవాలయ ప్రతిష్ఠను సప్త సంతానాలలో ఒకటిగా పరిగణించారు. ధన నిక్షేపం, వనప్రతిష్ఠ, తటాక ప్రతిష్ఠ, ప్రబంధ రచన, అగ్రహార ప్రతిష్ఠ, దేవాలయ ప్రతిష్ఠ, స్వసంతానం (పుత్రుడు) సప్తసంతానాలుగా పేర్కొనబడ్డాయి. ఒక్క స్వసంతానం తప్ప మిగిలినవన్నీ దేవాలయానికి సంబంధించినవే. దేవాలయ నిర్మాణంలో భాగంగానే ధనం, వనం, తటాకం, అగ్రహారం, ప్రబంధం సమకూరుతాయి. వేదకాలంలో మూర్తి ఉన్నట్లుగాని, విగ్రహారాధన జరిగినట్లుగాని ఆధారాలు లేవు. దేవతలను మంత్ర స్వరూపులుగా ఋషులు దర్శించారు. కాని కాలక్రమేణ రాజులు పాప పరిహారార్థం దేవాలయాలు నిర్మించారని చరిత్ర చెబుతుంది. క్రీ.శ. 808-847 లో నరేంద్ర మృగరాజు 108 యుద్ధాలు చేసి 108 శైవ దేవాలయాలను నిర్మించాడు. క్రీ.శ. 641-673 మధ్యకాలంలో చైనా యాత్రికుడు హుయాన్ సాంగ్ ఆంధ్రదేశానికి విచ్చేసి రాజధాని వేంగిని చూసి బౌద్ధమతం నశించిందని హిందూ దేవాలయాలు ఎక్కడ చూసినా ఏర్పడ్డాయని వర్ణించాడు. వేద సంస్కృత పోషణకై ఘటికా స్థలాలను నిర్మించారు. చాళుక్య రాజులు హిందూ మతాన్ని ఆదరిస్తే, రాణులు జైన మతాన్ని ఆదరించారు. బృహత్పలాయనుల కాలంలో జయవర్మ రాజును పరమ మహేశ్వరునిగా పూజించారు. రాజులే దేవుళ్ళుగా పూజింపబడ్డారు. క్రమేపి బౌద్ధ చైత్యాలు కపోతేశ్వరాలయాలుగా మారాయి. పల్లవులు శివ విష్ణు దేవాలయాలకు దానాలిచ్చారు. కర్మకాండను వ్యతిరేకించటంతో ప్రారంభమైన బౌద్ధం వైదిక మతంలాగే కర్మకాండను అనుసరించింది. దేవుడి అస్తిత్వాన్ని నిర్లక్ష్యం చేసిన మతం బహుదేవతారాధనకు పూనుకుంది. జైన మందిరాలు బౌద్ధాలయాలుగా అవి హిందూ ఆలయాలుగా మారడం మనకు తెలిసిందే.

శాసనాలు దేవుని ప్రాముఖ్యాన్ని, అగ్రహారాల ఆదాయాన్ని గురించి వివరిస్తున్నాయి. సుంకాలు వసూలు చేసి దేవాలయాలకు దానం చేసేవారని శాసనాలు వివరిస్తున్నాయి. దేవాలయం కట్టించినందుకు సుంకం మినహాయింపు జరిగినట్టుగా శాసనాలు పేర్కొన్నాయి. రాజులు, రాణులు, సామంతులు, ఉద్యోగులు, భూస్వాములు, వర్తకులు తమతమ అభినివేశాన్ని తెలియజేయటానికి ఆంధ్రదేశంలో నలుమూలలా కట్టించిన శివాలయాలు, వైష్ణవాలయాలు ఉన్నాయి. ఆలయ సేవలకై ఆస్తులిచ్చేవారు.

ఆగమాలు, శాస్త్రాలు విధించిన నియమాలకు అనుగుణంగా ఆలయాలను నిర్మించారు. పల్లవుల ఆలయ శిల్పకళ కాంబోడియా, జావా వంటి వలస రాజ్యాలకు వ్యాపించింది. కృష్ణదేవరాయల కాలం మతమౌఢ్యాన్ని విడిచి మత సహనాన్ని చూపి మహమ్మదీయులను క్రైస్తవ మతస్థులను ఆదరించింది. దీని వలన ప్రజలలో నిర్మాణాత్మక శక్తి వికాసానికి తోడ్పడింది. పోర్చుగీసు వారు 1545లో మూడువేల మంది సైన్యాన్ని శాన్‌థోమ్‌లో దింపారు. తిరుపతి దేవాలయాన్ని కొల్లగొట్టేందుకు బయలుదేరారు. పెద్దతుఫాను వచ్చి ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఈ విధంగా ఇతరులు దేవాలయాలను కొల్లగొట్టడం అనాదిగా జరుగుతునే ఉంది. 1602లో జెస్యూట్ ఫాదరీ 'మనకు రోమ్ ఎలాగో ఈ సంస్కారహీనులకి పేర్‌మల్ (పెరుమాళ్ళు) దేవాలయం అలాగ' అని జవాబు రాసాడు. మన మతం పట్ల నిరసన భావం చూపించారు. దేవాలయాలు సంపదకు నిలయాలు కావటంవలన ఒకప్పుడు విదేశీయులు దండయాత్రలు చేసి సంపదను కొల్లగొట్టారు.

దేవాలయ గర్భగుడి చిరుచీకటిగా ఉంటుంది. ఒక్క దేవ విగ్రహం తప్ప ఇతర శిల్పాలేమీ ఉండవు. కాలక్రమంలో రామాయణ భారతకథలు చిత్రాలుగా శిల్పాలుగా గోడల్ని అలంకరించాయి. వాస్తు శిల్పకళకు

ఆలయ నిర్మాణాలు ప్రసిద్ధిపొందాయి. అమరావతీ రీతి, అపరాజిత శైలి, మహామల్ల శైలి, విక్రమేంద్ర శైలి అని పాలకుల శైలి కనిపిస్తుంది. శిల్పశాస్త్రం గురించి ఆగమశాస్త్రం చెపుతుంది. దేవాలయ ప్రతిష్ఠలో కోటి సంఖ్య మంత్రజపం జరగాలని శాస్త్రం. ప్రపంచాని కంతటికీ మేలు కలిగించే పురాణ శ్రవణం, జానపద కళలు అన్ని వర్గాల ప్రజల వినోదం కోసం దేవాలయ ప్రాంగణంలో జరిగేవి. పూర్వం దేవాలయాలకు, జానపద కళలకు, కోతుల పోషణకు మాన్యాలుండేవి.

మధ్యయుగంలో దేవాలయాలు కేవలం పూజా స్థలాలుగానే ఉపయోగింపబడలేదు. విద్య, పురాణ శ్రవణం, హరికథాకాలక్షేపం, పంచాంగ శ్రవణాలకు నిలయాలయ్యాయి. ఆచార సంప్రదాయాలకు, చరిత్ర, భాష, సాహిత్యం, శిల్పం, సంగీతం, నృత్య అభినయాలకు కేంద్రాలయ్యాయి.

**నేటి పరిస్థితి :**

- దేవాలయాలు సమాజం ఒక వాక్యంలో చెప్పేదికాదు. క్రీ.శ. 2–3, 4–7 మధ్యకాలంలో దేవాలయాలు కనిపిస్తున్నాయని భిన్న అభిప్రాయాలు ఉన్నాయి.
- సనాతన ధర్మం పలు మార్పులకు లోనయ్యింది. రాజకీయంగా పలుమార్పులకు చోటిచ్చింది.
- రాష్ట్రానికి రాష్ట్రానికి ఉత్తర భారతానికి దక్షిణ భారతానికి భిన్న దేవతలు, భిన్న పూజా విధానాలు ఉన్నాయి. ప్రాంతీయత కూడా ప్రధాన కారణం. ముస్లిం, బ్రిటిషు రాజుల దాడులు ఉత్తర భారతదేశంలో అధికం కాబట్టి దేవాలయాలు పెద్దవిగా ఉండవు. దక్షిణ భారతదేశంలో దేవాలయాలు ఎకరాల కొలదీ విస్తీర్ణం ఎక్కువ. ఉత్తర భారతదేశంలో పూజలు ఇంట్లో జరుగుతాయి. పల్లెటూళ్ళో చిన్న చిన్న గుడులు కనిపిస్తాయి.
- నిర్మాణాలలో శైవ, వైష్ణవ ఆలయాలకు తేడా ఉంటుంది. శివాలయానికి రెండు గోపురాలు, వైష్ణవాలయానికి మూడు గోపురాలుంటాయి.
- సంప్రదాయ దేవాలయాల్లో సంస్కృతం, ఇతర దేవాలయాల్లో ప్రాంతీయ భాష కొనసాగుతుంది.
- సమాజంలో వర్ణవ్యవస్థ రక్షింపబడింది. ఇది ఆధునిక సమాజంలో రుగ్మతగా గుర్తింపబడింది.
- ప్రాచీనకాలంలో రాజు మతధర్మాన్ని పరిరక్షించాడు. పూజారి దానిని ప్రచారం చేసాడు. దేవాలయ రక్షణ రాజుదే. ఉత్సవాలలో రాజు రథాన్ని లాగేవాడు. అందుకే యాత్రికుడు ఫాదరీ వీరిని సంస్కార హీనులన్నాడు.
- ఆనాడు ధర్మ వర్తనం కోసం దేవుళ్ళను సృష్టించారు. ధ్యానం వలన సామన్య మానవుడు దేవుని గుర్తించలేడని మనిషిని పోలిన ఆకారాన్ని దేవుళ్ళకు ఆపాదించారు. స్త్రీని కించపరచటం వలన స్త్రీ దేవతా మూర్తులను సృష్టించారు. మగవాడు స్త్రీ కివ్వవలసిన గౌరవాన్ని ఆశించి దేవతలను సృష్టించారు. ప్రజలను అదుపులో పెట్టుకోవటానికే ఆనాటి వ్యవస్థ పుట్టిందని అన్నారు.
- వ్యవసాయానికి సంబంధించిన దేవతలు (వానదేవుడు) వెలిసారు.
- పట్టణాలలో ప్రపంచీకరణ నేపథ్యంలో వ్యాపారాత్మకంగా దేవాలయాలు, గ్రామదేవతలు ఎక్కువయ్యారు. దీనికి ప్రాంతీయత ఒక ప్రధాన కారణం. రాజకీయం రెండవది.

* పూర్వం గుడి ఏర్పడి దాని చుట్టూ గ్రామం ఏర్పడింది. ఈనాడు నగరంలో జన సముదాయం ఏర్పడిన తరువాత గుళ్ళు వెలుస్తున్నాయి. దానికి కారణం (రోడ్డు) క్రమబద్ధీకరణలో అంతరాయం సృష్టించటానికి, మత వైరుధ్యాల పోటీలు, రాజకీయానికి మతం అండదండగా నిలవటం... మొదలైనవి.
* నేడు స్వదేశీయులు మతాన్ని ధ్వంసం చేయటమే కాక దేవాలయ మాన్యాలు, సంపదతో పాటు ఆలయ విగ్రహాలను, ఆభరణాలను కూడా దోచుకుంటున్నారు.

**ముగింపు :**

ప్రపంచ గమనం ఒక లయబద్ధంగా ఐక్యతతో నడిచిపోతుంది. మౌనం ఒక బలమైన మాధ్యమం. మనం అవునన్నా కాదన్నా సృష్టిని ఆపలేం.

కాని దేవాలయాలు కాలంతో బాటు మారలేదు.

నేటి మానవుడు బౌద్ధిక జీవి కాబట్టి రాతి విగ్రహాలను చూడటం లేదు, దేవతలను చైతన్యమూర్తులుగా అమూర్త రూపంలో చూడగలుగుతున్నాడు. అవగాహన పెరిగి భగవంతుడిని చైతన్యశక్తిగా చూస్తున్నాడు. ఉన్నత స్థాయికి ఎదిగే దిశలో దేవాలయాలు మానవుడి అవసరాలను, ఆవశ్యకతను తీర్చాయి.

మనశ్శాంతి కోసం సమస్యల పరిష్కరణకోసం ప్రజలు దేవాలయాలకు వస్తుంటారు. ఆధ్యాత్మిక సౌందర్యానికి, సంస్కృతి, సంస్కరణలకు, కళావిప్లవానికి దేవాలయాలు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి.

దేవుని పని అని శిల్పులు తమ శక్తి కొద్దీ శ్రమించినా, రచనలలోగాని, క్షేత్రమహాత్మ్యాలలోగాని ఆలయ నిర్మాణ కర్తల పేర్లు లేకపోవటం, కొన్ని వర్గాలవారికి ఆలయప్రవేశం లేకపోవడం, ప్రగతి పథంలో పయనించక పోవటం వంటి లోపాలు పలువురిని బాధించాయి. బ్రాహ్మణవాదం బలపడిందనే అభిప్రాయమూ ఉంది.

రాజు కొడుకు రాజు. పూజారి కొడుకు పూజారి అనే కాలం పోయింది. సమర్థుడైన వాడే అర్హుడనే కాలం కాబట్టి పరీక్షల మూలంగా అర్చక వృత్తి ఎవరైనా చేపట్టవచ్చనే అభిప్రాయం స్థిరపడింది. జ్ఞానమున్న వాడే కదా బ్రాహ్మణుడు !

హోదాని వ్యక్తపరిచే విధంగా పోటీపడి పాశ్చాత్య నాగరికత మోజులో ఆధునిక కళ్యాణమండపాలలో నేడు వివాహాలు ఆడంబరంగా నిర్వహిస్తున్నారు. పూర్వం పెళ్ళికి ప్రధాన సాక్షి భగవంతుడని భావించి గుడిలో వివాహం జరిపేవారు. గుళ్ళల్లో పెళ్ళిళ్లు నిర్వహించడంవల్ల ఆలయ పోషణకు బాధ్యత వహించినవారవుతారనే భావనను కోల్పోయారు.

హైటెక్ హంగులు ఎన్ని పెరిగినా, మానవుడు ఎంత ఎదిగినా ఒక మహత్తర శక్తి ప్రకృతిలో ఒదిగి ఉందన్న సత్యాన్ని విస్మరించలేదు.

ధనవంతులు శివునికి ఆలయాలను కట్టారు. నేను పేదవాడిని ఏం చేయగలను? నా కాళ్ళే స్తంభాలు, ఉదరమే గోపురం, శిరస్సే బంగారు కిరీటం అని తన భక్తిని చాటుకున్నాడు 12వ శతాబ్దం నాటి బసవన్న.

ప్రతి మనిషిలోనూ దైవాంశ ఉంటుంది. భగవత్ స్వరూపుడే మానవుడు. అంత ఎత్తుకు ఎదగాలి అంటే దైవానుగ్రహంతో పాటు మానవాకాంక్ష అవసరం. వ్యక్తిత్వ వికాసంలో మానవుడే దేవుడిని ఆరోహణ క్రమంలో చేరాలి. భగవంతుడు మానవుడిని అవరోహణ క్రమంలో చేరాలి. దీనికి భక్తి, కర్మ, జ్ఞాన మార్గాలు ఉపకరిస్తాయి.